# చైతన్య గళం

తెలుగు దిన పత్రిక








సంచిక :176 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగర్ మంగళవారం 30-7 -2024 వెల : .రూ. 5.00




## నేటి నుంచి లక్షన్నర

# రుణాల జమ

- జులై 31 కంటే ముందే మాఫీ చేస్తామని స్పష్టం
- ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ
- ఆగస్ట్ పదిహేనులోగా 2లక్షల మాఫీ
- సిఎం రేవంత్ ప్రకటనతో పక్కాగా కార్యాచరణ

**29, జూలై (చైతన్యగళం)- హైదరాబాద్,**

ఆగస్టులో రుణమాఫీ పక్రియ పూర్తి చేసి మాట నిలబెట్టుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు కార్యాచరణ సాగుతోంది. రూ.1.50 లక్షల్లోపు పంటరుణం ఉన్న ప్రతి రైతుకు రెండో విడతగా జులై 31 కంటే ముందే మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.6,093 కోట్లు జమ చేశాం. వచ్చే నెల 2 నుంచి 14వ తేదీ వరకు విదేశీ పర్యటనకు వెళ్తున్నాను. తిరిగివచ్చిన వెంటనే రూ.2 లక్షల్లోపు ఉన్న -మిగతా 2 లో



## ముగిసిన లాల్‌దర్వాజ బోనాలు

### రెండ్రోజుల పాటు వైభవంగా వేడుకలు

**హైదరాబాద్,** రెండ్రోజుల పాటు జరిగిన లాల్‌దర్వాజ బోనాలు ఎంతో వైభవంగా ముగిశాయి. యాపకొమ్మలు చేతిలో పట్టుకొని.. బోనాలను నెత్తిమీద పెట్టుకొని.. ఆడబిడ్డలు ఆలయాలకు పోటెత్తారు. ఇంటిల్లిపాది సల్లంగా చూడు తల్లి.. అంటూ.. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, -మిగతా 2 లో



## హైదరాబాద్‌లో శాంతిభద్రతలు దారుణం

-పట్టపగలే హత్యలు జరుగుతున్నా పట్టింపేది

-అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్

**హైదరాబాద్**

తెలంగాణ అసెంబ్లీలో ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాదులో అన్ని పోలీస్ స్టేషనులకు లంచాలు, మామూళ్లు వెళ్తున్నాయని అక్బరుద్దీన్ ఆరోపించారు. ఈ విషయం చెప్పడానికి తాను ఎవరికీ భయపడనని, నిజాలు నిర్భయంగా మాట్లాడుతానంటూ అసెంబ్లీలో చర్చలో భాగంగా -మిగతా 2 లో


# బిజెపి చక్రవ్యూహంలో ప్రజలు విలవిల



- భయం గుప్పిట్లో అన్ని రంగాల ప్రజలు
- అగ్నివీర్‌లను మోసం చేస్తోన్న ప్రభుత్వం
- ఓ ఇద్దరి ప్రయోజనం కోసం పనిచేస్తున్న మోడీ
- బడ్జెట్ ప్రసంగంలో రాహుల్ ఘాటు విమర్శలు
- తిప్పికొట్టిన ఎంపిలు, మంత్రులు

**29, జూలై (చైతన్యగళం)- న్యూఢిల్లీ,**

లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు వాడీవేడీగా కొనసాగుతున్నాయి.బడ్జెట్ పై ప్రసంగం వేళ విపక్షనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో తీవ్ర దుమారం చెలరేగింది. ఇద్దరు ప్రముఖ పారిశ్రామికవేత్తలు దేశంలోని మౌలిక సదుపాయాలను నియంత్రిస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించడం ఇందుకు కారణమయ్యింది. వ్యాపారవేత్తల పేర్లను ప్రస్తావించడంపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల వాదనలతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో -మిగతా 2 లో



## అధికారిక ముద్రతో కొత్త పట్టాదార్ పుస్తకాలు

- గత పాలకుల తప్పులను సరిదిద్దేలా నిర్ణయం
- మదనపల్లి తరహా ఘటనలు జరక్కుండా చర్యలు
- చట్టాల దుర్వినియోగం..చర్యలపై చంద్రబాబు సమగ్ర సమీక్ష

**29, జూలై (చైతన్యగళం)-అమరావతి,**

పట్టాదారు పాస్‌పుస్తకాలపై తన బొమ్మ వేసుకుని తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడిన గత పాలకుడి తప్పులను సరిదిద్దుతున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. తాత, తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులపై ఎవరి బొమ్మా ఉండకూడదన్నది ప్రజల అభిప్రాయ మన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం తరహాలో అహంకారం, పెత్తందారీ పోకడలు ప్రజా ప్రభుత్వంలో ఉండబోవని, ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ.. వారి ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. సోమవారం ఉదయం రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రెవెన్యూశాఖలో ప్రస్తుత పరిస్థితిపై అధికారులను ఆరా తీశారు. మదనపల్లె తరహా ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, గత ఐదేళ్లలో తెచ్చిన చట్టాలు, -మిగతా 2 లో

## రైతుల సమస్యలను మీ రాష్ట్రాల్లో తీర్చండి



### పార్లమెంటులో మాట్లాడడం కాదు..ఆచరించండి
### రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**29, జూలై (చైతన్యగళం)- న్యూఢిల్లీ,**

ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సోమవారం పార్లమెంట్‌లో రైతు సంక్షేమంపై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రైతు సంక్షేమంపై రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ చెప్పిన మాటలు తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో -మిగతా 2 లో

## విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో అవినీతి

- విద్యుత్ విచారణ కమిషన్ ఏర్పాటుతో ముచ్చెమటలు
- కమిషన్ రద్దు చేయాలని కెసిఆర్ ఎందుకు కోర్టుకు వెళ్లారు
- విద్యుత్ సివిల్ పనులన్నీ అనుయాయులకు కేటాయింపు
- అసెంబ్లీలో గత ప్రభుత్వ విధానాలపై రేవంత్ విమర్శలు



**29, జూలై (చైతన్యగళం)-హైదరాబాద్**

విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాటు తదితర విషయాల్లో అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. గత ప్రభుత్వ అక్రమాలను వెల్లడిస్తూ సిఎం రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. అలాగే విద్యుత్ కమిషన్ విసయంలో ఛైర్మన్‌ను మార్చాలని సుప్రీం సూచించిందే తప్ప.. విచారణను ఆపమనలేదని అన్నారు. విచారణ ఆపాలని కోర్టుకు వెళ్లిన కెసిఆర్.. -మిగతా 2 లో

# నేటినుంచి లక్షన్నర రుణాల జమ

(మొదటి తరువాయి)

రైతుల రుణాల మొత్తాన్ని మాఫీ చేస్తాం. రైతుల రుణం తీర్చుకుని వారికి కృతజ్ఞత తెలియజేస్తాం అని ప్రకటించారు. దీంతో ఈ నెలాఖరుకు లక్షన్నర లోపు రుణాలు మాఫీ కానున్నాయి. తెలంగాణ రైతులు ఎంతగానో ఎదురు చూసిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించింది. మొదటి విడతగా లక్ష మేరకు రుణాలు మాఫీ చేయాలని సర్కార్ నిర్ణయం తీసుకుని.. దాన్ని అమలు చేసింది. అలాగే జూలై నెలాఖరు వరకు లక్షన్నర.. ఆగష్టు 15 నాటికిమొత్తం రెండు లక్షల రుణాబకాయిలను రైతుల తరఫున ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించేలా ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 18న సాయంత్రం ముఖ్యమంత్రి రుణమాఫీని విడుదలచేశారు. లక్ష వరకు రుణాలు మాఫీ చేసినట్లు ప్రకటించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోంది. అందులో ముఖ్యమైనది రైతురుణమాఫీ. అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ రైతాంగానికి రెండులక్షణ రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హాయంలో చేయలేనిది తాము చేసి చూపిస్తామని చెప్పడమే కాదు.. చేసి చూపించారు సీఎం రేవంత్. ఇప్పటికే లక్ష రుణాలు మాఫీ చేసిన కాంగ్రెస్... రెండో విడత రుణమాఫీకి రంగం సిద్ధం చేసింది. మంగళవారం రెండో విడత రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లక్షన్నరలోపు ఆరు లక్షల మంది రైతులకు రుణాలను మాఫీ చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వనికి ఏడు వేల కోట్లు అవసరం. గతంలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం12 లక్షల మందికి ఆరు వేల కోట్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. సుమారు పదకొండున్నర లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7వేల కోట్లు జమ చేసినట్లు వివరించారు. నిధులు విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు రైతువేదికల వద్ద సంబురాలు చేసుకున్నారు. రైతు రుణమాఫీకి రూ. 31 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. రుణమాఫీ నిధులను వేరే అప్పులకు జమ చేయవద్దని ఇప్పటికే బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల రుణమాఫీ పథకం వర్తిస్తుందని చెప్పారు. కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామని, రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. బ్యాంకుల్లో రుణమాఫీ నగదు జమ చేయడంతో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. రైతు కుటుంబాన్ని గుర్తించడానికి ఆహార భద్రతాకార్డు వివరాలు ప్రామాణికంగా రుణమాఫీ ఉంటుందని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. సెంబరు 12, 2023 నాటికి రైతుకు ఉన్న రుణం, లేక రెండు లక్షల వరకు ఏది తక్కువైతే దాన్ని పొందేందుకు రైతులు అర్హులు. అలాగే రెండు లక్షల మించిన రుణం ఉన్న రైతులు ఆపైన ఉన్న రుణాన్ని మొదట చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన ఉండగా, ఆ తరువాతనే రుణమాఫీ పొందే వెసులుబాటు కల్పించింది.

# బిజెపి చక్రవ్యూహంలో ప్రజలు విలవిల

(మొదటి తరువాయి)

జోక్యం చేసుకున్న పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజిజు.. రాహుల్‌కు సభానియమాలు తెలియవంటూ విమర్శించారు. అందుకు బదులిచ్చిన రాహుల్.. అధికార పక్ష నేతల వ్యవహారశైలికి అనుగుణంగా స్పందిస్తామన్నారు. గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలో భయానక వాతావరణం నెలకొందన్నారు. చక్రవ్యూహం ద్వారా ఈ భయం వ్యాపిస్తోందన్న రాహుల్.. భాజపా ఎంపీలతో సహా రైతులు, కార్మికులు, ప్రతి ఒక్కరూ అందులో చిక్కుకుంటున్నారని అన్నారు. అగ్నివీర్‌లను కేంద్రం మోసం చేస్తోందన్న రాహుల్.. వీరి పింఛను కోసం బడ్జెట్ లో రూపాయి కూడా కేటాయించలేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేసినప్పటికీ.. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించలేదన్నారు. వేల సంవత్సరాల క్రితం హరియాణాలోని కురుక్షేత్రలో అభిమన్యుడిని చక్రవ్యూహంలో బంధించి హత మార్చారు. చక్రవ్యూహంలో హింస, భయం ఉంటాయి. అభిమన్యుడు అందులో చిక్కుకొని బలైపోయాడు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం చక్రవ్యూహాన్ని నిర్మిస్తే.. కుల గణన చేపట్టి దాన్ని విచ్ఛిన్నం చేస్తామని ఉద్ఘాటించారు.ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తారాస్థాయిలో విరుచుకుపడ్డారు. 2024 బడ్జెట్ మధ్య తరగతి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం మధ్యతరగతికి ద్రోహం చేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాలను తొలగించి, మధ్యతరగతి ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ఆధునిక చక్రవ్యూహాన్ని నిర్మించిందని.. అందులో రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి వారు, సమాజంలోని ఇతర వర్గాలు చిక్కుకొని ఉన్నారన్నారు. దీర్ఘకాలిక లాభాలపై పన్ను విధించడంతో.. మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని వర్గాలను బీజేపీ భయపెడుతోందని ఆరోపించారు. కేంద్రమంత్రులతో పాటు నేతలు సైతం భయపెడుతున్నారని.. దేశవ్యాప్తంగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయని ధ్వజమెత్తారు. ట్యాక్స్ టెర్రరిజంతో వ్యవస్థ ఆగమవుతోందని అన్నారు. పలు రకాల ట్యాక్సుల పేర్లతో ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. పద్మవ్యూహం కమలం ఆకారంలో ఉంటుందని.. బీజేపీ గుర్తుని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు. పద్మవ్యూహం లాంటి కమలం పార్టీ దేశంలో అధికారంలో ఉందని, అందుకే రైతులుభయపడుతున్నారని అన్నారు. మహాభారతంలో పద్మవ్యూహాన్ని ఆరుగురు నియంత్రిస్తే.. ఇప్పుడు మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, అజిత్ దోవల్, అంబానీ, అదాని లాంటి వారు కంట్రోల్ చేస్తున్నారని నిప్పులు చెరిగారు. కేంద్రంలోని ప్రభుత్వం అదానీ, అంబానీల కోసమే ఉందంటూ రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఒకవైపు పేపర్ లీక్, మరోవైపు నిరుద్యోగ చక్రబంధంలో దేశం ఉందని.. ఇంటర్న్‌షిప్ వల్ల యువతకు ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. కాళ్లు విరగ్గొట్టి.. మీద బ్లాంకెట్ వేసినట్లు ఉందంటూ తూర్పారపట్టారు. అగ్నివీర్‌ల పెన్షన్‌కు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, మధ్యతరగతిని పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర ఇవ్వాలని రైతులు చాలాకాలం నుంచి అడుగుతున్నారని.. కానీ బ్జడెట్‌లో దాని ప్రస్తావనే లేదని నిప్పులు చెరిగారు. ఇదిలావుండగా.. రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అప్పుడు స్పీకర్ ఓంబిర్లా కలగజేసుకొని అభ్యంతరం తెలిపారు. ఒకరు ప్రసంగిస్తున్నప్పుడు ఇలా అడ్డుతగలడం సబబు కాదని.. సభా మర్యాదలను పాటించాలని కోరారు. ఈ క్రమంలో దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశమైన 'అగ్నిపథ్' పథకాన్ని రాహుల్ గాంధీ తప్పుదోవ పట్టిస్తున్నారని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇదే అంశంపై పార్లమెంటులో ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నాట్టు తెలిపారు. మరోవైపు బ్జడెట్‌పైనా విపక్ష నేత అపోహలు వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వివరణ ఇస్తారని అన్నారు. 'దేశ సరిహద్దు రక్షణలో జవాన్లు నిమగ్నమై ఉంటారు. జాతీయ భద్రతకు సంబంధించి సున్నితమైన అంశమిది. అగ్నివీర్ సమస్యపై దేశాన్ని తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్పీకర్ అవకాశం ఇచ్చినప్పుడు ఓ ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నా' అని తెలిపారు.

## రైతుల సమస్యలను మీ రాష్ట్రాల్లో తీర్చండి

(మొదటి తరువాయి)

రైతులకు ఇచ్చిన హామీలపై రాహుల్ ఎందుకు మాట్లాడట్లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు, వారి సంక్షేమానికి అనేక హామీలు ఇచ్చింది. వీటిల్లో రైతులు, కౌలు రైతులకు రూ.15,000 , వ్యవసాయ కూలీలకు రూ. 12,000 , మద్దతు ధరపై బోనస్‌గా రూ.500 ఇస్తామని ప్రగల్భాలు పలికారు. వీటిలో ఏ ఒక్క హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయట్లేదని, వీటిని అమలు చేసే దిశగా ముందు రాహుల్ దృష్టి సారించాలని కిషన్ రెడ్డి చురకలంటించారు. 2004 నుంచి 2014 మధ్య కాలంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రైతులను నిర్లక్ష్యం చేసిన సంగతి గుర్తుచేశారు. 2013లో పార్లమెంట్ సాక్షిగా యూపీఏ ప్రభుత్వ హయాంలో చెప్పిన మాటలు మర్చిపోయారా? స్వామినాథన్ కమిటీ సిఫార్సులను ఆమోదించలేమని అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్ సభా వేదికపై చెప్పిన సంగతి గుర్తులేదా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కనీస మద్దతు ధరను అందించడం మార్కెట్ అవకతవకలకు దారితీస్తుందని, ఉత్పత్తి వ్యయానికి మధ్య యాంత్రిక అనుసంధానం కొన్ని సందర్భాల్లో ప్రతికూల ఉత్పాదకతను కలిగిస్తుందని అప్పటి యూపీఏ ప్రభుత్వం పేర్కొనలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ మొసలి కన్నీరును ప్రజలు, రైతులు నమ్మే స్థితిలో లేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ రైతులకు చట్టబద్ధంగా ఎంఎస్‌పి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందిస్తూ కిషన్ రెడ్డి యూపీఏ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 2004 నవంబర్ 18న ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్ నేతృత్వంలో 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్ (ఎన్‌సిఎఫ్)' ఏర్పడిందని కిషన్ రెడ్డి కాంగ్రెస్‌కు గుర్తు చేశారు.

## విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో అవినీతి

(మొదటి తరువాయి)

ఎందుకు విచారణను అడ్డుకుంటున్నట్లో చెప్పాలన్నారు. ప్రశోత్తారాలపై చర్చను సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రద్దు చేశారు. ఆర్థిక నిర్వహణ , ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ డిమాండ్స్‌పై చర్చ చేపసట్టారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాల విషయంలో సత్యహరిశ్చంద్రుడి తరువాత కేసీఆరే అన్నట్లు వాళ్ల మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఛత్తీస్ ఘడ్, యాదాద్రి, భద్రాద్రి ఒప్పందాలపై వారే విచారణకు అడిగారని, వాళ్ల కోరిక మేరకే విచారణకు కమిషన్ నియమించామన్నారు.. కమిషన్ వద్దకు వచ్చి వివరాలు ఇవ్వాలని కోరితే కమిషన్‌పైనే ఆరోపణలు చేశారని విమర్శించారు. విచారణ కమిషన్ ముందు వాదన వినిపించకుండా కమిషన్ రద్దుచేయాలని కోర్టుకు వెళ్లారని, విచారణ కొనసాగించాల్సిందేనని సుప్రీంకోర్టు చెప్పిందని, అయితే కొత్త కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలని న్యాయస్థానం చెప్పిందని సీఎంరేవంత్ రెడ్డి తెలిపారు. విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను సోమవారం సాయంత్రంలోగా నియమిస్తామన్నారు. తెలంగాణకు వాళ్లే ఏదో కొత్త వెలుగులు తెచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వైఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోనే హైదరాబాద్ నగరానికి నిరంతర విద్యుత్ సరఫరా జరిగిందని, ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆ ఆస్తులు సంబంధిత ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని చట్టం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా, వినియోగ ప్రాతిపదికన విభజన జరగాలని ఆనాడు జైపాల్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించారన్నారు. రాజ్యాంగంలో లేని ప్రత్యేక మినహాయింపు తెలంగాణకు ఇప్పించారని, 53.46 శాతం తెలంగాణకు, 46.54 శాతం ఏపీకి విద్యుత్ పంపిణీ చేసేలా జైపాల్ రెడ్డి తీవ్రంగా కృషి చేశారని, తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లు కమ్మకుండా చేశారని కొనియాడారు.

## ముగిసిన లాల్‌దర్వాజ బోనాలు

(మొదటి తరువాయి)

డప్పుదరువులతో సిటీ బస్తీలన్నీ దద్దరిల్లాయి. ప్రతిష్టాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్‌లో లాల్ దర్వాజా బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి కోసం ప్రత్యేక ఘటం ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులను చెలించుకుంటున్నారు. మహంకాళి అమ్మవారికి బోనాలను భక్తులు సమర్పించారు. 23 ప్రధాన ఆలయాలో బోనాల జాతర ఘనంగా కొనసాగింది. బోనాల సందర్భంగా పలు ఆలయాల్లో భక్తుల కోసం అన్నదానాలకు ఏర్పాట్లు చేసారు. ఆలయాలన్నింటిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి..మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, హరిబౌలి అక్కన్న మాదన్న దేవాలయం, గౌలిపుర భారతమాత అమ్మవారి ఆలయం, మీరాలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయంతోపాటు ఉప్పుగూడ మహంకాళి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సింహవాహిని అమ్మవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పట్టువస్త్రాలు సమర్పించారు. హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్‌లతో కలిసి పట్టు వస్త్రాలు అందించారు. మీరాలం మండి మహంకాళేశ్వర అమ్మవారికి మంత్రి జూపల్లి కృష్ణారావు, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. సింహవాహిని అమ్మవారికి మంత్రులు శ్రీధర్‌బాబుతోపాటు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, లాల్‌దర్వాజా, మేకలబండ ప్రాంతంలో కొలువుదీరిన నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు అక్కన్న మాదన్న, సింహవాహిని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.ం

## హైదరాబాద్‌లో శాంతిభద్రతలు దారుణం

(మొదటి తరువాయి)

ఇలా వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ చర్చలో భాగంగా సోమవారం అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. 'ఏసీపీ ర్యాంక్ అధికారి నాకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్ కోసం డబ్బులు అడిగారు. పీఎస్ కోసం మమ్మల్ని డబ్బులు అడగటం ఏంటి. మీకు వచ్చే మామూళ్లు, లంచాలు ఏమయ్యాయి. ఆ డబ్బులు అయిపోయాయా? వాటితో మీరు పోలీస్ స్టేషన్ కట్టుకోలేరా? ఇదేంటో స్పీకర్ గారు మీరే చెప్పండి. ప్రభుత్వం ఇలాంటి పనులపై ఫోకస్ చేయాలని అన్నారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ సమస్య ఉంది. ఇదే విషయంపై అసెంబ్లీలో హరీష్ రావు, నేను మాట్లాడితే లా అండ్ ఆర్డర్ బాగుంది అని మంత్రులు చెబుతున్నారు. మళ్లీ నిన్న నగరంలో 3 హత్యలు అయ్యాయి. ఇంటి ముందు నిల్చున్న వారిని కొట్టడం కాదు. నేరస్తులను, దొంగలపై ప్రతాపం చూపించండి. నేరస్థులను పట్టుకోవడం టాస్క్ ఫోర్స్ పోలీసుల పని కానీ, వాళ్లు రాత్రి పూట సామాన్యుల మీద, అది కూడా ఇంటి ముందు నిల్చున్న వారిపై లాఠీఛార్జ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో పోలీసులు రాత్రిపూట డ్యూటీలు చేస్తూ, పగటి పూట పడుకుంటున్నారా. అందుకే నగరంలో పగటిపూట హత్యలు జరుగుతున్నాయని' అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో లా అండ్ ఆర్డర్ ఎక్కడుంది. నగరంలో ఎటు చూసినా నేరాలు ఘోరాలు జరుగుతున్నాయి. నగరంలో లా అండ్ ఆర్డర్ పై ఆరోపణలు చేయగా, అంతా ఓకే అని చెబుతున్నారు. మంత్రి అలాంటిదేమీ లేదని చెప్పిన మరుసటి రోజే నగరంలో మూడు హత్యలు జరిగాయంటే ఏమని అర్థం చేసుకోవాలి. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం సమస్య వస్తే, బయటకు వస్తే పోలీసులు కొడుతున్నారు. కొట్టారని బయటకు రాకుండా ఇంట్లోనే కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఐటీ ఉద్యోగులు అయితే అర్ధరాత్రి వేళ ఇంటికి వెళ్తారు, వారిపై సైతం వివరాలు కనుక్కోకుండా లాఠీ ఛార్జ్ చేస్తున్నారని పోలీసులపై ఆరోపణలు చేశారు.

## అధికారిక ముద్రతో కొత్త పట్టాదార్ పుస్తకాలు

(మొదటి తరువాయి)

దుర్వినియోగమైన తీరును అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో రెవెన్యూ శాఖలో తీసుకువచ్చిన చట్టాలు, అవి దుర్వినియోగం అయిన తీరుపై అధికారులతో చర్చించారు. సంస్కరణల పేరుతో కొత్త చట్టాలు తెచ్చి అక్రమాలకు పాల్పడిన విధానంపైనా సమీక్షించారు. పెరిగిన భూ వివాదాల నేపథ్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం తీసుకురావాల్సిన చర్యలపై చర్చించారు. ల్యాండ్ గ్రాబింగ్‌ను అరికట్టడానికి కొత్త చట్టాలు తేవాల్సిన అవసరం ఉందా.. ఉంటే ఎలాంటి కొత్త చట్టాలు తేవాలనే అంశంపైనా అధికారులను ఆరా తీశారు. మరోవైపు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీపై సమావేశంలో ప్రస్తావించిన చంద్రబాబు.. భూ యజమానులకిచ్చే పట్టాదారు పాస్ పుస్తకాలపై ప్రభుత్వ రాజముద్ర ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో భూ అక్రమాల ఆరోపణలపై, గత ఐదేళ్లలో రెవెన్యూ శాఖలో తీసుకువచ్చిన చట్టాలపై సమీక్ష నిర్వహించారు. పెరిగిన భూ వివాదాలను పరిష్కరించడంపైనా చంద్రబాబు పలు సూచనలు చేశారు. అక్రమంగా జరిగిన భూలావాదేవీలెన్ని నష్టపోయింది ఎంత?, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఎన్ని ఎకరాలు వెళ్లాయి? పూర్తి డేటాతో వచ్చేవారంతో మరోసారి సమీక్షకు రావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భూసర్వే పేరుతో రాష్ట్రంలో 77లక్షల రాళ్లు పాతారని చెప్పిన అధికారులు వివరణ ఇచ్చారు.. విశాఖ, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరుల్లో అత్యధికంగా భూములపై ఫిర్యాదులు వచ్చాయని.. వాటిపై వచ్చేవారంలోగా పూర్తి డేటా కావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పీలో త్వరలో కొత్తగా ల్యాండ్ పాస్‌బుక్‌ల పంపిణీ చేపట్టనున్నారు. పాస్‌బుక్‌లలో కొత్తగా క్యూఆర్ కోడ్‌ల ముద్రణ, యజమాని వివరాలతో పాటు క్యూఆర్ కోడ్‌లో రూట్‌మ్యాప్ కూడా ఉండేలా ఎ÷-లాన్ చేస్తున్నారు. 20కోట్ల రూపాయల ఖర్చుతో కొత్త పాస్‌బుక్‌ల రూపకల్పన చేయనున్నారు. కాగా.. మదనపల్లి ఘటనపై సీఎం చంద్రబాబు స్పెషల్ ఫోకస్ పెట్టారు. అధికారుల దర్యాప్తులో తేలిన అంశాలపై ఆరా తీశారు. బాధ్యులపై తక్షణమే చర్యలు ఉండాలని చంద్రబాబు ఆదేశించారు.

# చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బహుమతి

**-సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరక్టర్ జనరల్ శ్రీ రాజేంద్ర చౌధురి**
**-కర్నూలులోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కాలేజీలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం**
**-కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు**



**కర్నూలు జులై 29 (చైతన్య గళం):** చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్పబహుమతి అని, మొక్కలు నాటి సంరక్షించుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరక్టర్ జనరల్ శ్రీ రాజేంద్ర చౌధురి తెలిపారు. భారతదేశ ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, కర్నూలు ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజీలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ రాజేంద్ర చౌధురి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కర్నూలు ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ హెడ్ శ్రీ డి. మురళి మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించటం మనందరి బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. పర్యావరణం – ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందని, ఈ దిశగా విద్యార్థులంతా అమ్మ పేరిట ఒక మొక్క స్ఫూర్తిని వ్యాప్తి చేయటంలో భాగస్వాములు కావాలని సూచించారు. దేశంలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంచటంతో పాటు, పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత ఆవశ్యకమన్న గౌరవ ప్రధానమంత్రి మాటలు అక్షర సత్యాలని కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కులు నాటడమే కాకుండా, ఆ చాయా చిత్రాన్ని తీసుకుని #Plant4Mother #హ్యాష్ ట్యాగ్ లను వినియోగించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. శాంత, సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కర్నూలులోని ఆల్ ఇండియా రేడియో కేంద్రాన్ని సందర్శించిన శ్రీ రాజేంద్ర చౌధురి, స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

# తిరుమల కృష్ణమాచార్యులు సేవలు మరువలేనివి



**అచ్చంపేట జూలై 29 (చైతన్య గళం):** సత్య సాయి కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సామాజిక సేవ తత్పరులు కళా రంగాన్ని పోషించిన కళాభిమానులు, కళాకారులు అయినా శ్రీ తిరుమల కృష్ణమాచార్యులు సేవలు మరువలేనివని టీ రఘుపతి తెలిపారు. పట్టణంలోని సత్యసాయి కళా సమితి క్షేత్రంలో సభ్యులందరూ మౌనం వహించి వారికి నివాళులు అర్పించారు. కృష్ణమాచార్యులు కళా రంగం నే కాకుండా జ్యోతిష్య శాస్త్రంలో అపారమైనటువంటి పాండిత్యాన్ని సంపాదించి ఎంతోమందికి సరైన దిశలో మార్గదర్శనం చేశారని అన్నారు. వారి సేవలు ఎల్లప్పుడూ గుర్తుంచుకొని వారి బాటలో నడిచి కళా రంగం అభివృద్ధి కోసం అందరూ పనిచేయాలని సూచించారు. వారిని కోల్పోవడం బాధాకరమని, కళారంగానికి సమాజానికి లోటు అని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సత్య సాయి కళా సమితి సభ్యులు సైదయ్య, రఘునందన్, బద్రి మాస్టర్, అల్లాజీ, పెబ్బేటి నిరంజన్, వీరయ్య, ఆంజనేయులు, వెంకటేష్, పాల్గొన్నారు.

# మనుభాకర్ కు అభినందనలు తెలిపిన వాకిటి శ్రీధర్




**వనపర్తి జులై 29 (చైతన్య గళం):** పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశానికి తొలి పతకం అందించిన మను భాకర్‌కు వనపర్తి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు, భారసా జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్అభినందనలు తెలిపారు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మను భాకర్ కాంస్యం సాధించడం దేశం గర్వించదగ్గ విషయమని ఆమె ఇచ్చిన స్ఫూర్తితో భవిష్యత్తులో యువ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధిస్తారని అన్నారు.

# గోరింటాకు ధరిస్తే ఆరోగ్యం,సౌభాగ్యం

**-జిల్లా పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు చెన్న పద్మ**
**-మాజీ కౌన్సిలర్ నందిమల్ల శారద**



**వనపర్తి జులై 29 (చైతన్య గళం):** ఆషాడ మాసంలో సహజ సిద్ధంగా దొరికే ప్రకృతి వరదాయని గోరింటాకు పెట్టుకుంటే మహిళలకు ఆరోగ్యం, సౌభాగ్యం, ఆనందం కలుగుతాయని వనపర్తి జిల్లా పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు చెన్న పద్మ తెలియజేశారు. అయ్యప్ప ఆలయంలో జరిగిన గోరింటాకు పెట్టుకుందాం అనే కార్యక్రమంలో గౌరీ దేవి రుధిరాంశతో వెలసిన గోరింటాకు ఆషాడ మాసంలో పెట్టుకుంటే మహిళలకు ఆరోగ్యం ఆనందం సౌభాగ్యం కలుగుతాయని, గోరింటాకు లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, అరచేతిలో గర్భాశయ ప్రధాన నాడులు ఉంటాయి గోరింటాకు పెట్టుకోవడం వల్ల అధిక ఉష్ణాన్ని తగ్గించి గర్భాశయ దోషాలు బాధలు తగ్గిపోతాయని బాలింతలకు డెలివరీ తర్వాత గోరింటాకు గోరింటాకు ముద్దను ఇవ్వడం వల్ల ప్రసవం వల్ల కలిగే బాధలు తగ్గిపోతాయని తెలియజేశారు. శరీర ఉష్ణాన్ని బట్టి గోరింటా ముదురు లేదా ఆరంజ్ రంగులో పండుతుంది మందారంలా పండుతే మంచి మొగుడు వస్తాడని గన్నేరులా పండితే కలవారు వస్తారని గోరింటాకు పెట్టుకోవడం వల్ల స్త్రీ త్వపు హార్మోన్ పనితీరు చక్కగా అయి శరీరం మరింత కోమలంగా తయారవుతుంది అందమైన భర్త వస్తాడని భర్త ప్రేమగా చూసుకుంటాడని అంటారు. తలకు పట్టించి తల స్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా కండిషనర్ గా పనిచేస్తుంది గోరింటాకును అతివలు ఆదరిస్తే ఆనందంగా ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెన్న పద్మ పద్మశాలి సంఘం వనపర్తి జిల్లా మహిళా అధ్యక్షురాలు,మాజీ కౌన్సిలర్ నందిమల్ల శారద ,గంజి రత్నమ్మ , కెంచె భాగ్యమ్మ, తిరుమల సక్కుబాయి, సారంగ శిరీష, వరకాల లక్ష్మి, చెన్న సరిత, శ్రీదేవి, స్వాతి, వనపర్తిపట్టణ పద్మశాలి సంఘం కార్యవర్గం, వనపర్తి జిల్లా పద్మశాలి సంఘం కార్యవర్గం పాల్గొనడం జరిగింది.

# వినూత్న ఆవిష్కరణలపై యువత దృష్టి సారించాలి

**-వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**




**వనపర్తి జులై 29 (చైతన్య గళం):** ఉన్నత చదువులు అభ్యసించి ప్రయోగాత్మక ఆలోచనలు కలిగిన యువకులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించడ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.పంటలకు, చీడపీడల నివారణ కోసం రసాయనాలను పిచికారి చేసే సమయంలో రైతుల శరీర రక్షణ కోసం యువకులు వేముల ప్రవీణ్, ఓం ప్రకాష్ లు వినూత్నంగా తయారుచేసిన ప్రత్యేక వస్త్రం గురించి ఎమ్మెల్యే కు వివరించారు.సోమవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారు ఆయనతో కలిసి మాట్లాడారు.రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ కంపెనీ తరఫున ఒక ప్రత్యేక వస్త్రాన్ని తయారు చేస్తున్నామని అందుకు తమ సహకారం కావాలని వారు ఎమ్మెల్యే ను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.ప్రజలకు ఉపయోగపడే వినూత్న ఆవిష్కరణలపై మీలాంటి యువత దృష్టి సారించి అధునాతన వ్యవసాయాన్ని పెంపొందించేందుకు సహకరించాలని నూతన వస్త్రాన్ని తయారుచేసిన వారిని ఆయన అభినందించారు.



సైదాబాద్ లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ నివాసంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ.

# ఉరుకులు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ



**శ్రీశైలం జూలై 29 (చైతన్య గళం):** ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు పోటెత్తుతూ ఉరుకులు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ శ్రీశైలం ప్రాజెక్టుకు నాలుగు లక్షలకు పైగా క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో ఏపీకి చెందిన ఇరిగేషన్ శాఖ అధికారి కబీర్ భాష చేతుల మీదగా సోమవారం సాయంత్రం 4. 20 నిమిషాలకు ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి దిగువన ఉన్న నాగార్జునసాగర్ కు నీటిని వదిలారు. అయితే మంగళవారం ఉదయం అటు ఏపీ మంత్రులతో పాటు ఇటు తెలంగాణకు చెందిన మంత్రులు కూడా కలిసి శ్రీశైలం గేట్లు ఎత్తెఅవకాశం ఉందని ముందుగా అధికారులు అంచనా వేసినప్పటికీ వారి అంచనాలను తారుమారు చేస్తూ ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి 3,84,64 లక్షల క్యూసెక్కుల వరద అలాగే సుంకేసుల బ్యారేజీ నుంచి 1, 40, 478 లక్షల క్యూసెక్కుల వరద తో మొత్తంగా 4.84,864 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో శ్రీశైలం ప్రాజెక్టు 885 అడుగులు కాగా 215.87 టీఎంసీల సామర్థ్యం నీటి నిలువ ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో సోమవారం ఉదయం నాటికి 879. 80 అడుగులు చేరుకోగా 182.6050 టీఎంసీల సామర్థ్యం చేరుకుంది. ప్రాజెక్ట్ అధికారులు సోమవారం ఉదయం అధికారులు అంచనా వేసినట్టుగానే సాయంత్రం నాలుగు గంటల తర్వాత గేట్లను ఎత్తి నీటిని సాగరకు విడుదల చేశారు. నురుగులు కక్కుతో కృష్ణమ్మ సాగరకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మూడు ట్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని 80 టీఎంసీల వరద జలాలు, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా మరో 63 టీఎంసీల నీటిని వదులుతుండడంతో.. ప్రాజెక్టు వద్ద ఆకాశం వైపు ఎగిసిపడుతున్న నీటి ప్రవాహం తెల్లని హిమబిందువలె నురుగులు కక్కుతూ కృష్ణమ్మ నాగార్జునసాగర్ వైపు పరుగులు పెడుతుంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తుతారని తెలుసుకున్న పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. వరద ప్రవాహం అలాగే కొనసాగితే రాత్రికి గాని మంగళవారం ఉదయం గాని మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉంది

# చెప్పులు కుట్టే కార్మికులను ఆదుకోవాలి

**ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ**




**వనపర్తి జులై 29 (చైతన్య గళం):** వనపర్తిలో ఏళ్లుగా రోడ్ల పక్కన చెప్పులు కుట్టే వృత్తి(చర్మకార)పై జీవిస్తున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటియూసీ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో స్నేహ ఫుట్పాత్ వర్కర్స్ సెంటర్ లో చెప్పులు కుట్టే కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వనపర్తి పట్టణం రాజీవ్ చౌక్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, గాంధీ చౌక్, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఎండవానకు కష్టాలు పడుతూ చెప్పులు కుడుతూ, జీవిస్తున్నారన్నారు. ఒక్కొక్కరి రోజు ఆదాయం రూ. వంద కూడా మించటం లేదన్నారు. చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆదుకోవలసిన అవసరం ఉందన్నారు. పనిముట్లు, ముడి సరుకు ( చర్మం, లెదర్ ) బ్యాంకుల నుంచి రుణం, నీడ కోసం షెడ్లు ఇవ్వాలన్నారు. చెప్పులు కుట్టే పని వల్ల త్వరగా రోగాల బారిన పడుతున్నారని, ప్రత్యేక వైద్య వసతి కల్పించాలన్నారు. ఎక్కువమందికి ఉండడానికి ఇండ్లు లేవని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు.చాలామందికి ఆసరా పింఛన్లు కూడా లేవన్నారు. ప్రతి ఒక్కరికి నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల చెప్పుల కంపెనీలు మార్కెట్లోకి రావడంతో వారి వృత్తి పూర్తిగా దెబ్బతిన్నదని ఆదుకోవటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, నాయకులు శాంతన్న, నజీర్, వెంకటేశ్వర్లు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ విస్తీరణానికి కృషి చేస్తా



**కడ్తాల్ జులై 29 (చైతన్య గళం):** కడ్తాల్ IYC అనే ఆప్ ద్వారా జరగబోయే యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని రెండు చేతులు చాచి అడుగుతున్న ఆలోచించండి ఒక్క అవకాశం ఇవ్వండి అని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి మొహ్మద్ ఇమ్రాన్ బాబా ఒక ప్రకటనలో కోరారు.

# సీత్ల పండుగ ఘనంగా నిర్వహించడం జరిగింది



**ఆమనగల్లు జులై 29 (చైతన్య గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విటాయిపల్లిలో కౌన్సిలర్ సుజాత రాములు ఆధ్వర్యంలో సీత్ల పండుగ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజు, బాలు, వాడ్య, సురేష్, రవీందర్, రవి, శ్రీను, గోపి, దశరథ్, మల్య, తిరుపతి, లాలాన్, మహేష్ హర్షగన్య, రమేష్ వెంకటేష్ ఉన్నారు.



కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు ఉత్సవాల్లో పాల్గొన్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు అర్విందర్ కుమార్ గౌడ్ ఘన స్వాగతం పలికిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అనూప్ బుగిడి , రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేందర్ సింగ్.

# బాలల అభివృద్ధి అందరి లక్ష్యం కావాలి

**-పరశురాములు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి**



**హైదారాబాద్, జులై 29 (చైతన్య గళం):** వరంగల్ నగరంలోని శివనగర్ ప్రాంతంలో ఉన్న డాన్ బాస్కో బాలల గృహంలో బాలల అభివృద్ధి, సమాజ బాధ్యత పైన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ చైర్పర్సన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వరంగల్ జిల్లా మండల పరశురాములు హాజరై మాట్లాడుతూ బాలల యొక్క రక్షణ, సంరక్షణ శారీరక, మానసిక అభివృద్ధి పైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి వారి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి అని అన్నారు అలాగే పిల్ల ల హక్కుల కొరకు వారి యొక్క శ్రేయస్సు కొరకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని పిలుపునిచ్చారు. బాలలు సమాజానికి అతి ముఖ్యమైన వనరులు వారికి సరి అయిన విద్య మరియు ఆరోగ్య సాంఘిక సేవలు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు బాలలు ఈ దేశ సంపద నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు బాలల అభివృద్ధికి కోసం సమాజం ముందుకు రావాలని వారికి సహాయం చేయడానికి ప్రతి ఒక్కరు చేయూత అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో సిబ్బంది దివ్య శారద రాజు అనిత భారతి ఉల్లాస వసంత జ్యోతి బాలల హక్కుల కార్యకర్త ఎండి బాల్పాషా బచ్పన్ బచావో ఆందోళన్ కోఆర్డినేటర్ శిరీష బాలలు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ నిరుపేదల శ్రేయస్సే ధ్యేయంగా ఐక్యత ఫౌండేషన్ సేవలు

**- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**




**వెల్దండ 29, జూలై (చైతన్యగళం):** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్ట నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ శంకర నేత్రాలయ వారిచే ఈనెల 19వ తేదీన ప్రారంభం అయ్యి 11 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగిన ఉచిత కంటి శిబిరంలోదాదాపు 2500(రెండు వేల ఐదు వందల మందికి) పైగా పరీక్షలు నిర్వహించగా దాదాపు నూట అరవై ఐదు మంది కంటి శుక్లాల పేషెంట్లకు ఆపరేషన్ ప్రిపేర్ చేయగా వారిలోనూట యాభై మంది పేషెంట్లకు విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశామని,మిగతా 15 మంది పేషెంట్లు వివిధ కారణాలతో ఆపరేషన్ కి గైర్హాజరయ్యారని పదహారు వందల మందికి పైగా కంటి అద్దాల పంపిణీ చేశామని,వీరిలో 260 రెండు వందల అరవై మందిని శంకర నేత్రాలయ చెన్నై బేస్ హాస్పిటల్ కి రిఫర్ చేశామని,నియోజకవర్గ నిరుపేదల కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు కూడా ఇంకా పెద్ద ఎత్తున కొనసాగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ గౌడ్,ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,నరేందర్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,మల్లయ్య,రమేష్ నాయక్, కొండల్,యూసఫ్, కొండల్ రెడ్డి, హస్సన్,గణేష్, మల్లేష్, శేఖర్, శ్రీపతి, లాలు,శ్రీను,శ్రీను,మహేష్,కళ్యాణ్,భాస్కర్,మల్లేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన TPCC ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



**ఎల్బీనగర్ జులై 29 (చైతన్య గళం):** ముఖ్యమంత్రి సహాయనిది నిరుపేదలకు మేలు చేస్తుంది అని TPCC ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త . నాగోల్ లోని ఉప్పల శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో BN రెడ్డి నగర్ సాయి రామ్ కాలనీ కి చెందిన హన్య శ్రీ D/O శ్రవణ్ కుమార్ గుప్త ముఖ్యమంత్రి సహాయనిది నుంచి మంజూరు ఐన రూ.60 వెలు, మునుగోడు నియోజకవర్గానికి చెందిన లక్ష్మమ్మ W/oకృష్ణయ్య రూ 16,000/-వెలు చెక్కును ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ మొదటి కర్తవ్యం అని నిరు పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి వుంటుంది అని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యం లోని తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుంది.ప్రభుత్వ ఆసుపత్రి లలో వైద్య సదుపాయాలు మెరుగు పరిచి నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నాము. గర్భిణీ స్త్రీ లకు సాధారణ ప్రసవాలు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అత్యవసర సమయాల్లో ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి CMRF ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నాము. ప్రయివేటు హాస్పటల్ లో ఐన బిల్లులతో CMRF దరఖాస్తు చేసుకొంటే వీలయినంత సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందిస్తాము.అని ఆయన అన్నారు.

# బీసీ కులవృత్తులకు పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

**-బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు సీనియర్ దోరేపల్లి రవీందర్**



**జడ్చర్ల జులై 29 (చైతన్య గళం):** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో బీసీ కులాలకు కాంగ్రెస్ సర్కార్ మొండి చేయి చేయించిందని, అలాగే అన్ని రకాల కులవృత్తులను విస్మరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దొరేపల్లి రవీందర్ ఆరోపించారు. ఆసరా పెన్షన్స్, దళితులకు, గిరిజనులకు, గొల్ల కుర్మలకు, ముదిరాజ్ తదితర కులాలకు అన్యాయం చేశారని అన్నారు. దళిత బంధును 10 లక్షలు మాజీ సీఎం కెసిఆర్ ఇస్తే కాదు మేము దళితులకు 12 లక్షలు ఇస్తమని ఎన్నికల్లో ఓటు వేయించుకొని బయటపడ్డాక ప్రజలను విస్మరిస్తున్నారని విమర్శించారు. బడ్జెట్లో ఎక్కడ దళిత బంధుపథకం గురించి ప్రస్తావన లేదని అన్నారు. వృద్ధులకు, వికలాంగువాలకు పెన్షన్స్ పెంచుతారని అనుకున్నారని, కానీ వాళ్లకు కూడా పెంచడానికి ఎక్కడ మాట్లాడలేదని పేర్కొన్నారు. బడ్జెట్లో బీసీ వాళ్లకు కులావృత్తుల పేరిట లక్ష రూపాయల సహాయం చేద్దామని ఆలోచించిన కెసిఆర్ ని కాదని ప్రజలు కాంగ్రెస్ కి ఓట్లు వేసినందుకు వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట 20 వేల కోట్లు పెడుతామాని చెప్పి కేవలం 7 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులను కలుపుకొని కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి అందరికీ సమ ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఫ్రీ బస్సు, 200 రూపాయల విద్యుత్, 500 రూపాయల సిలిండర్ ఇలాంటి పథకాలు కాదు అని.. జిల్లాలో ఉన్న పాలమూరు ఎత్తి పోతల పథకానికి నిధులు కావాలని, ప్రాజెక్టులు పూర్తిచేయాలని దోరేపల్లి రవీందర్ డిమాండ్ చేశారు.

# బడ్జెట్లో కులవృత్తులకు ప్రాధాన్యతగ్గడం విచారకరం

**-బీ ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు ఉదిత్యాల శ్రీధర్ గౌడ్**



**బాలానగర్ జులై 29 (చైతన్య గళం):** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో అన్ని రకాల కులవృత్తులకు పెద్దగా కేటాయింపులు లేకుండానే కాంగ్రెస్ సర్కార్ విస్మరిస్తుందని, ఇది ఎంత విచారకరమని బీ ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు ఉదిత్యాల శ్రీధర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. ఆసరా పెన్షన్స్, దళితులకు, గిరిజనులకు, గొల్ల కుర్మలకు, ముదిరాజ్ తదితర కులాలకు అన్యాయం చేశారని అన్నారు. దళిత బంధును 10 లక్షలు మాజీ సీఎం కెసిఆర్ ఇస్తే కాదు మేము దళితులకు 12 లక్షలు ఇస్తమని ఎన్నికల్లో ఓటు వేయించుకొని బయటపడ్డాక ప్రజలను విస్మరిస్తున్నారని విమర్శించారు. బడ్జెట్లో ఎక్కడ దళిత బంధుపథకం గురించి ప్రస్తావన లేదని అన్నారు. వృద్ధులకు, వికలాంగువాలకు పెన్షన్స్ పెంచుతారని అనుకున్నారని, కానీ వాళ్లకు కూడా పెంచడానికి ఎక్కడ మాట్లాడలేదని పేర్కొన్నారు. బడ్జెట్లో బీసీ వాళ్లకు కులావృత్తుల పేరిట లక్ష రూపాయల సహాయం చేద్దామని ఆలోచించిన కెసిఆర్ ని కాదని ప్రజలు కాంగ్రెస్ కి ఓట్లు వేసినందుకు వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట 20 వేల కోట్లు పెడుతామాని చెప్పి కేవలం 7 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులను కలుపుకొని కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి అందరికీ సమ ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఫ్రీ బస్సు, 200 రూపాయల విద్యుత్, 500 రూపాయల సిలిండర్ ఇలాంటి పథకాలు కాదు అని.. జిల్లాలో ఉన్న పాలమూరు ఎత్తి పోతల పథకానికి నిధులు కావాలని, ప్రాజెక్టులు పూర్తిచేయాలని శ్రీధర్ గౌడ్ డిమాండ్ చేశారు.